జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: కాకినాడలో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ యోగా పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి, బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్ -14 బృంద విభాగంలో చైతన్య సాగర్ నాయుడు, మౌళీశ్వర్, చైతన్య తేజ, ఆశ్రిత్ చరణ్ కుమార్, అండర్ - 17 బృంద విభాగంలో జి. సోమ సూర్య చరణ్, బి. దేవాన్ష్ నాయుడు, పి. సోహన్ శ్రీ, సిహెచ్. జయదీప్, సిహెచ్. రక్షిత్ సెప్టెంబర్ 13 వ తేదీ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంతేకాకుండా సాంప్రదాయ ఈవెంట్ లో జి. సోమ సూర్య చరణ్ బంగారు పతకం, దేవన్ష్ నాయుడు రజత పతకం, సిహెచ్. రక్షిత్ కాంస్య పతకం, పి.సోహన్ శ్రీ 4వ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, యోగా గురువులు సురేష్, జయంతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

వికలాంగుల పెన్షన్ తొలగించడం దుర్మార్గం : సిపిఐ

విశాలాంధ్ర-అనకాపల్లి: చంద్ర బాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం అర్హులైన వికలాంగుల పెన్షన్ తొలగించడం దుర్మార్గమని సిపిఐ నేతలు తాకాశి వెంకటేశ్వరరావు , వై. ఎన్. భద్రం తీవ్రంగా మండిపడ్డారు. పుట్టుకతో పోలియో వ్యాధితో బాధపడుతు కదలలేని వికలాంగులకు సైతం పెన్షన్ తొలగించి ఈ ప్రభుత్వం వారి ఉసురు పోసుకుంటుందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు దేవుడెరుగు గానీ, ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. 80% వికలాంగుల "రీ" వెరిఫికేషన్ పేరుతో 40 శాతం కు లోపు, పైన నెపం తో వారి జీవితాలతో ప్రభుత్వం లోపు,బయట ఆటలాడుకోవడం ఆటవిక చర్యని వారి విమర్శించారు. అర్హులైన వారిని40%లోపు కు కుదించి వారికి పెన్షన్ తొలగించి, అనేకమంది ని వీధిపాలు చేశారని, ఇది అన్యాయం అన్నారు. ఈ పెన్షన్ డబ్బులతోనే బతుకుతున్న అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడానికి సిద్ధమవుతున్నారని ప్రభుత్వం వెంటనే దీనిపై పునరాలోచించి పెన్షన్లు పునరుద్ధరించాలని లేకుంటే వికలాంగుల, వృద్ధుల ఉసురు తగిలి కూటమి ప్రభుత్వం కు గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని వారు హెచ్చరించారు. నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులు ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారి గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అనర్హుల పెన్షన్లు జారీచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



విశాలాంధ్ర -నర్సీపట్నం: అర్హత లేకపోయినా ఇప్పటివరకు విక లాంగుల పింఛను పొందిన వారితో పాటు వారికి సర్టిఫికేట్లు జారీ చేసిన వైద్యులపై కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి అనర్హులైన వికలాంగుల పింఛన్లపై స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు లక్ష మంది వరకు అనర్హులైన వికలాంగులు గుర్తించబడ్డారని చెప్పారు. ఈ అంశంపై రెండు నెలల క్రితం సీఎం నారా చంద్రబాబు నాయుడు కి తాను లేఖ రాసినట్టు వివరించారు. నిబంధనల ప్రకారం 40 శాతం పైగా వైకల్యం ఉన్నవారిని మాత్రమే అర్హులుగా గుర్తించాల్సి ఉంటుందని, 40 శాతం కంటే తక్కువ ఉన్నవారిని అనర్హులుగా గుర్తిస్తారని స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం 4,148 మంది వికలాంగులలో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నవారిని గుర్తించారని, అందులో 120 మందిని ఆరోగ్య పింఛన్లకు ఎంపికచేసినట్టు తెలిపారు. అలాగే 679 మందిని వృద్ధాప్య పింఛన్లలోకి మార్చగా, 3,349 మంది అనర్హులైన వికలాంగుల పింఛన్లు రద్దు చేసినట్టు వెల్లడించారు. వీరిలో అర్హత ఉన్న అనర్హులుగా ఉన్నవారు తాజాగా వైద్యుల ధృవపత్రం తీసుకుని తిరిగి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. రద్దైన పింఛన్లపై ప్రభుత్వం నెలకు రూ. 2.94 కోట్లు, ఏటా రూ. 35.28 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 742 మందిని అనర్హులుగా గుర్తించగా, వారిలో 8 మందికి ఆరోగ్య పింఛన్లు, 114 మందికి వృద్ధాప్య పింఛన్లు మంజూరుచేసి, 670 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేశామని ఆయన వివరించారు. వీరందరికీ నెలకు రూ. 40.20 లక్షలు, ఏటా రూ. 4.82 కోట్లు, ఐదేళ్లకు రూ. 124 కోట్లు చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న అనర్హులుగా గుర్తించిన వారు ఈ నెల 25వ తేదీ లోపు వైద్యుల ధృవపత్రాలు సమర్పించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత లేకపోయినా గత ఐదేళ్లుగా ప్రభుత్వ నిధులను వాడు కున్నారని, వారికి సర్టిఫికేట్లు జారీ చేసిన వైద్యులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.

తాగుబోతు వీరంగం..

ఇద్దరిపై హత్యాయత్నం

విశాలాంధ్ర-కే కోటపాడు: పూటుగా మద్యం తాగి.. ప్రతి ఒక్కరిని తరచూ డబ్బులు కోసం వేధించడమే కాకుండా గ్రామంలో ఉన్న అత్త అల్లుడిపై మారణాయుధాలతో హత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఇక్కడ జరిగింది. ఈ మండలం కింతాడ శివారు గంగాభవాని పాలెం గ్రామానికి చెందిన లాలం నూకరాజు అత్త బండారు దేవుడమ్మలు కే కోటపాడులో తన సొంత రైస్ మిల్లు , కోళ్ల ఫారం వద్ద పనులు ముగించుకుని బయటకు వస్తుండగా కింతాడ గ్రామానికి చెందిన సిరవరపు శివ స్వామి నాయుడు తనకు మందు కోసం డబ్బులు కావాలని వీరిద్దరిని డిమాండ్ చేశారు. తమ వద్ద డబ్బులు లేవని ప్రతిరోజు ఇలా తాగి ఇంట్లో వారిని వీధిలో ఉన్న వారిని ఇబ్బందులు పెట్టడం సరికాదని నూకరాజు సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. తనకు ఎవరూ నీతులు చెప్పనక్కర్లేదని తనను అనే వాడివా అంటూ.. శివ స్వామి నాయుడు ఒక చేత్తో గొడ్డలి మరో చేత్తో కత్తి పట్టుకుని నూకరాజు మెడపై కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర రక్తస్రావమైన నూక రాజు

అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయాడు. అడ్డుకోబోయిన అత్త దేవుడమ్మ ను కూడా గాయపరచగా వీరిద్దరిని అక్కడున్నవారు ఆసుపత్రికి తరలించారు. నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కత్తి గొడ్డలి స్వాధీనం చేసుకుని నిందితుడును అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా శివ స్వామి నాయుడు తరచూ మద్యం సేవించి గ్రామంలో కొంతకాలంగా అలజడి సృష్టిస్తున్నాడని , డబ్బులు ఇవ్వకపోతే ఎంతటి వారి పైనా దాడులు చేస్తుంటాడని గ్రామస్తులు తెలిపారు. అదే బెంగతో ఇటీవల తండ్రి సీత న్నాయుడు మరణించాడు. భార్య పిల్లలు కూడా ఇతను వేధింపులు భరించలేక పలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

వైసిపి గొలుగొండ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా జగదీష్ నాయుడు

జగన్మోహన్ రెడ్డికు మాజీఎమ్మెల్యే గణేష్ కు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-గొలుగొండ: వైఎస్ ఆర్సిపి గొలుగొండ మండలం బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా సుర్ల జగదీష్ నాయుడు ను వైయస్సార్ సిపి కేంద్ర కార్యాలయం నుండిఉత్తర్వులు విలువడ్డాయి. మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా యాళ్ల సన్యాసి నాయుడు తోపాటు మరో 18 మందితో మండల బీసీ సెల్ కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా వైసిపి పార్టీ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సుర్ల జగదీష్ నాయుడు బుధవారం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ముందుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి నర్సీపట్నం మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వైఎస్ఆర్సిపి పార్టీని మండలంలో మారుమూల గ్రామాల్లో సైతం బలోపేతం చేసేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మండలంలో ఉన్న వివిధ వైయస్సార్సీపి కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా ప్రతినిధులు పెద్దలు సూచనలు సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతామన్నారు.

టీడీపీ మండల అధ్యక్షులు విజయ్ సొంత నిధులతో విద్యార్థులకు క్రీడా సామగ్రీ పంపిణీ

విశాలాంధ్ర -మునగపాక: యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్ తన సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్లువాలీబాల్, క్రికెట్, బేస్బాల్,బ్యాట్మింటన్,స్కిప్పింగ్,రూప్స్,హ్యాండ్ రింగ్స్,బాస్కెట్బాల్ స్పోర్ట్స్ కు సంబంధించిన పరికరాలను జిల్లా పరిషత్ హై స్కూల్ కి బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమశెట్టి శ్రీనివాసరావు,రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం,పిఎసిఎస్ అధ్యక్షులు విల్లూరి నర్సింగరావు,క్లస్టర్ ఇంచార్జిలు కాండ్రేగుల శంకర్,గులింగుల గోవిందా, జనసేన మండల నాయకులు ఆడారి శ్రీకాంత్,పెంటకోట శ్రీరామ్ మూర్తి,హై స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు,దాడి జగన్నాథరావు దొడ్డి బుజ్జి,దాడి భీమ నాయుడు,పారునాయుడు,గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సొసైటీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేత



విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం చేతుల మీదగా అందజేశారు గ్రామానికి చెందిన వైబోయిన లక్ష్మీకాంతం అనే మహిళకు మోకాలి చిప్ప మార్పిడి చికిత్స చేయించుకోవడం జరిగింది. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి కు దరఖాస్తు చేసుకోవడంతో 70 వేల రూపాయలు మంజూరు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు అబద్ధం మాట్లాడుతూ... రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత సిఫార్సుతో ఎరివల్లి వాసు(రేవుపోలవరం) 25000, గంపా ధనలక్ష్మి (వాకపాడు)19000, గొరపల్లి అనురాధ (తిమ్మాపురం) 38541 ,గన్నెం భవాని (వమ్మవరం) 80 వేల 250 రూపాయలు సహాయనిది మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ , మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీను, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు, బండి బాబురావు, వై. శివ నాగేష్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



విశాలాంధ్ర-చోడవరం రూరల్: చోడవరం శ్రీ కనకమహాలక్ష్మి కోపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ నేతృత్వంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు బ్యాంకు అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు తెలియజేశారు. ఈ శిబిరంలో 180 మందికి పరీక్షలు నిర్వహించారు. 65 మందికి ఆపరేషకు సిద్ధం చేశారు. అందులో గ్లాకోమా ,రెటినా బారిన పడిన వారు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డీజీఎం వి. రమేష్, బ్యాంక్ సీఈవో శ్యామ్ కిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు లేని చింతపాక పెదమదిన రోడ్డు...

-చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు

- గ్రావెల్ కు బదులు మట్టి వాడకం వల్లే కొట్టుకుపోయాయి...

విశాలాంధ్ర -బుచ్చయ్యపేట: మండలంలోని ఎర్ర వాయి ప్రాంతం నుండి అటు మండల కేంద్రానికి వాణిజ్య కేంద్రమైన వడ్డాదికి ప్రధాన రహదారిగా పేర్కొంటున్న చింతపాక పెద మదిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు,రోడ్డు భద్రత నియమాలు గానీ ఏమాత్రం కనబడడం లేదు. ప్రధానంగా రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన బెరములు గ్రావెల్ వినియోగించకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుల పొలాల నుండి మట్టిని తీసి వెయ్యడం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు మట్టి కొట్టుకుపోయింది. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేకుండా రోడ్డు పక్కన ఉన్న పొలాలలో నుంచి మట్టి వాడుతున్నారని గ్రావెల్ వాడకుండా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విశాలాంధ్రలో ప్రచురితమైన శీర్షికకు సంబంధించిన అధికారులు ఏ విధంగా స్పందించకపోవడంతో రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ ఇష్టారీతిగా రోడ్డు నిర్మాణం

కొనసాగిస్తుండడంతో అధికారుల వైఖరిపై పలు అనుమానాలను రేకెత్తిస్తుంది. భద్రతా ప్రమాణాలు ఏమాత్రం పాటించకుండా రోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో పది రోజులుగా ఒక లారీ మట్టిలో కూరుకుపోయి బయటకు తీయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలోనే హంస పాదులాగా రోడ్డు నిర్మాణం మొదట్లోనే ఇటువంటి పరిణామాలు ఎదురవుతున్నాయని భద్రతా ప్రమాణాలు పాటించకపోతే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నా అటు అధికారులు కానీ కాంట్రాక్టర్ గాని చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించకపోతే జిల్లా అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తిమ్మనపాలెంలో వరుస చోరీలకు పాల్పడ్డ వ్యక్తి అదుపులోకి...

విశాలాంధ్ర-చోడవరం: మండ లం లోని తిమ్మనపాలెం గ్రామంలో, ఈ నెల 07 నుండి 18 వరకు వరుసగా జరిగిన దొంగతనాలు పై అధికారులు సూచనల మేరకు చోడవరం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 5గురు ఇళ్ళల్లో దొంగతనం చేసిన దొంగను అదుపులోకి తీసుకుని, అతని నుండి సుమారు 4 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి బుధవారం మీడియాకు తెలియజేశారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చోరీ సొత్తు విలువ 4,50,000/- ఉంటుందని అన్నారు. ఈ కేసులో దొంగతనాలు చేసిన ముద్దాయి కన్నూరు విష్ణుమూర్తిని అరెస్ట్ చేసి రిమాండు కు తరలించా మన్నారు. ఈ నిందితుడిపై తెలిపిన ఊరులోనే వుంటూ ఇళ్ళలో అందరు పొలం పనికి వెళ్ళిన టైం లో ఇళ్ళల్లోకి వెళ్లి బంగారం దొంగతనం చేస్తున్నాడని, ముద్దాయిని చోడవరం పోలీస్ వారు చాకచక్యంగా వారం రోజులలోనే పట్టుకొని కేసును చేధించినట్లు తెలియజేశారు. ముద్దాయిది తిమ్మన పాలెం గ్రామం పరవాడ కంపెనీలో హెల్పర్ గా పనిచేస్తూ వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. ఈ కేసును జిల్లాఎస్పీ తుహిన్ సిన్హా దిశానిర్దేశనలో, అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీ ఎల్.మోహన రావు పర్యవేక్షణలో, అనకాపల్లి సబ్ డివిజన్ డి.ఎస్.పీ శ్రావని ఆధ్వర్యంలో, క్లూస్ టీం, ఐటీ కోర్, మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో చోడవరం పోలీస్ ఇన్స్పెక్టర్ పీ. అప్పలరాజు మరియు వారి సిబ్బంది ఛేదించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డి ఎస్ పీ శ్రావని మాట్లాడుతూ... "ఇలాంటి సంఘటనలు ప్రజలలో భయం కలిగించకుండా, అప్రమత్తతతో ఉండాలని సూచిస్తున్నట్లు తెలిపారు. అనుమానస్పద వ్యక్తులను ప్రశ్నించడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం. నేరాలపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డి ఎస్ పీ శ్రావని, ఇన్స్పెక్టర్ అప్పలరాజు , సబ్ ఇన్స్పెక్టర్స్ నాగ కార్తీక్, జోగారావు లు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ..

వేతనాలకై హరిత రాయబారులు ఎదురుచూపులు..

కుటుంబ పోషణ భారంగా మారుతున్న వైనం

విశాలాంధ్ర-నర్సీపట్నం రూరల్ : గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడిక తొలగించి విధులు పరిశుభ్రంగా ఉంచే. చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతున్న హరిత రాయబారులకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వస్తులుండి పరిస్థితులు నెలకొన్నాయి. పల్లెటూర్లు చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో గ్రీన్ అంబాసిడర్ హరిత రాయబారులను ఏర్పాటు చేయడం జరిగింది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ఆశయంతో ప్రభుత్వం 2018 లో గ్రామాల్లో చెత్త నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్ తో పాటు గ్రీన్ గాడ్స్ నియమించారు. ఇందులో భాగంగా గ్రీన్ అంబాసిడర్గా హరిత రాయబారులకు స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి 6 వేల చొప్పున గౌరవ వేతనం నిర్ణయించారు. నర్సీపట్నం మండలంలో 11 గ్రామ పంచాయతీలకు 36 మంది హరిత రాయబారులు, గ్రీన్ గాడ్స్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వీరు పారిశుద్ధ్య పనుల పై నిమగ్నమయ్యారు. కొంతమందికి 3 నెలల, మరి కొంత మందికి 5 నెలలు నుండి గౌరవ వేతనాలు చెల్లించడం లేదు. ఒక్కొక్కరికి 6 వేలు చొప్పున 36 మందికి గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది. కొన్ని సంవత్సరాలు పాటు స్వచ్ఛంద కార్పొరేషన్ హరిత రాయబారులకు వేతనాలు చెల్లించింది. గత కొన్ని నెలలుగా స్వచ్ఛంద కార్పొరేషన్ నుంచి నిధులు రాకపోవడంతో పారిశుద్ధ కార్మికుల లైన హరిత రాయబారులకు గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో నేడు హరిత రాయబారులు అప్పులు చేసి కుటుంబ భారాన్ని మోస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీలకు 15వ ఆర్థిక నిధులు మంజూరు కాకపోవడంతో హరిత రాయబారుల వేతనాలు చెల్లించాలంటే పంచాయతీలకు భారంగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ప్రజలకు ఇన్ని నెలలు జీతభత్యాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని హరిత రాయబారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెల గౌరవ వేతనాలు చెల్లించకపోతే కుటుంబ భారాన్ని మోయడం కష్టంగా మారుతుందని పేర్కొంటున్నారు. మాకు నెల నెల గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో అప్పుసొప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని కిరాణా దుకాణాల్లో బాకీలు పెరిగిపోవడంతో కిరాణా దుకాణాలు దారులు కూడా అప్పులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే గౌరవ వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

సిపిఐ మండల కార్యదర్శి రాధాకృష్ణ

విశాలాంధ్ర-గొలుగొండ : ఈ నెల 23 నుండి 25 వరకు ఒంగోలు లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గొలుగొండ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి జి రాధాకృష్ణ కోరారు. పాత కృష్ణా దేవి పేట గ్రామంలో దాసరి నాగభూషణం కమ్యూనిటీ హాల్లో సిపిఐ పార్టీ 28వ రాష్ట్ర మహాసభలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ మతోన్మాద దాడులు పొలా మతాల పేరుతో రాజకీయ దాడులుతో అణగారిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి అన్నారు మహిళలపై అత్యాచారాలు గంజాయి మత్తుమందు డ్రగ్స్ విద్యార్థి యువజన లపై అధిక ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటన్నిటిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి వాటిని కాపాడ బాధ్యత ఎంతైనా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలు శ్రమజీవులు పేదల పక్షాన సిపిఐ పార్టీ పోరాడుతూ అనూక ఉద్యమాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐఅని ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపి పార్టీ సీనియర్ నాయకులు మేక సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో అనేకమంది ప్రాణ త్యాగాలు తో ను ఎర్రజెండా ముద్దుబిడ్డలు పార్లమెంట్, సభ్యులు, శాసనసభ్యులు రాజీనామా చేసి ఉద్యమం ఉద్యమం బాట పట్టి విశాఖ స్టీల్ ప్లాంట్ పరిశ్రమను అనేకమంది త్యాగాలతో సాధించకూడదని తెలిపారు విశాఖ ఉక్కును కార్మికులను ప్రజలను మధ్యపెట్టి దోచుకోవడానికి ప్రభుత్వ పరిశ్రమను అమ్ముకుంటూ పోతారా అంటూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు ఆదాని అంబానీ పార్కోట్ వ్యక్తులు పేద ప్రజల హక్కులు వాళ్ళ కాళ్ళ కింద ఉండేలా ప్రభుత్వ పరిశ్రమలు లేకుండా చేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వన్నాగమా వీటన్నిటిపై మేధావులు ప్రజానీకం ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కార్యదర్శి మేక భాస్కరరావు మహిళా సమైక్య మండల కార్యదర్శి దాసరి భవాని కె రాంబాబు శ్రీపాద సురేషు మేక సుబ్బారావు ఏ శ్రీను టీ నాగరాజు టి పైడియ జి గౌరీ పి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు .

ఉచిత బస్సుతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని, లేదంటే ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు కోరిబిల్లి జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం సీతయ్యపేట సెంటర్ వద్ద శ్రీ దుర్గా భవాని ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన మిత్ర 15వేలు విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీవో నెంబర్ 21, 31 రద్దు చేసి డ్రైవర్లకు జీవన హక్కులు కల్పించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు .ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని, జాతీయ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేయాలనీ కోరారు. శ్రీ దుర్గా భవాని ఆటో సంఘం అధ్యక్ష కార్యదర్శి లు అక్కిరెడ్డి నరసింగ రావు, పిల్లా రాజు మాట్లాడుతూ రాజాం నుండి, తురకల పూడి గ్రామం వరకు శిదిలా వ్యస్థకు చేరిన రోడ్లు ను మరమ్మతులు చేసి ప్రజలు ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ రావు, పిల్లలరమణ, బి. అప్పారావు, పి రాము, బి నానాజీ, కె. రవి, జి. కృష్ణ, ఎన్. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర-అనకాపల్లి: గవరపాలెం జీవీఎంసీ హై స్కూల్ లో పదవ తరగతి చదివిన 94-95 బ్యాచ్ విద్యార్థులు మృతి చెందిన తమ స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూతను బుధవారం అందించారు. బుధవారం జరిగిన కటోజు కిరణ్ కుమార్ దశదిన కార్యక్రమంలో పాల్గొని వారికి ఇరువురు కుమార్తెలు ఉన్నారని తెలుసుకున్న 94- 95 బ్యాచ్ మిత్రులు వారి కుటుంబానికి అండగా ఉండేందుకు చిరు సహాయంగా 1,22,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కర్రి మహా లక్ష్మీ నాయుడు, విల్లూరి హరికృష్ణ, విల్లూరి రాముడు, కొణతాల సంతోష్ ,కొణతాల నీలకంఠ, కాండ్రేగుల శశి, మద్దాల చిరంజీవి, వేగి జగన్, వరకుమార్ భాను, ఆది,రమణ, బుద్ద అప్పలనాయుడు, కాండ్రేగుల ఉమా,సురేష్, బొడ్డేడ జోగి నాయుడు, కే సురేష్, కే రమేష్,బొంగు మురళీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంచార్జ్ ఎంపీడీవో కె ఎస్ ప్రసాద్ నారాయణరావు ఆధ్వర్యంలో మండలం లో ఉన్న పంచాయతీ సెక్రటరీస్ ఇంజనీరింగ్ ఎస్టేట్స్ జీఎస్ డబ్ల్యూ ఎస్ సిబ్బంది కు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి మూడు రోడ్లు కూడలి వరకు ప్లాస్టిక్ నిర్మూలన, షాపుల వద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయుటంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాలంలో చెత్త రోడ్లపై,డ్రైనేజీ లలో చెత్త పెరిగిపోతే అపారిశుద్ధ్యం అవుతుందని, దీనివల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు.అలాగే గ్రామాల్లో ప్రతి ఇంటికి చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకొని, పంచాయితీ చెత్త బండి లో చెత్త వేయించాలని సిబ్బంది కి సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం మేజర్ పంచాయతీ ఈవో వైవి రాజేశ్వరరావు, సచివాయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధులుకు డుమ్మా కొడుతున్న వెటర్నరీ అధికారులు

విశాలాంధ్ర-కే కోటపాడు : స్థానిక పశుసంవర్ధక శాఖ పరిధిలో ఉన్న సిబ్బంది బుధవారం విధులకు డుమ్మా కొట్టి బదిలీల పార్టీలు చేసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న మండిపడ్డారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి వెటర్నరీ సిబ్బంది అందరూ గ్రామాల్లో అందుబాటులో లేకుండా బదిలీల ఫేర్వెల్ పార్టీ అంటూ విధులకు డుమ్మా కొట్టడం పై రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారని వెంకన్న విలేకరులకు తెలియజేశారు. స్థానిక వెటర్నరీ పరిధి కె .కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన సచివాలయాల్లో ఉన్న సుమారు 40 మంది గ్రామ సహాయకులు , రెండు మండలాలకు చెందిన ఐదుగురు వెటర్నరీ డాక్టర్స్ రైతులకు అందుబాటులో లేకుండా సిబ్బంది బదిలీల పార్టీలో సందడి చేసుకున్నారని అన్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి కె .కోటపాడు వెటర్నరీ ఆసుపత్రి వద్ద ఏ.డి . డాక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో బదిలీల పార్టీ నిర్వహించడంపై రైతులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పార్టీలు సన్మానాలు విధులకు ఆటంకం కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కొందరు రైతులు తుఫాను వల్ల ఇబ్బంది పడుతున్నారని , అదే విధంగా రైతులు వరి నాట్లు పనుల్లో బిజీగా ఉండడం వలన పశువులకు ఏ రకమైన అనారోగ్యం కలిగినా వెటర్నరీ సిబ్బంది అందుబాటులో లేకపోతే ఎలా అని వెంకన్న ప్రశ్నించారు. విధులకు డుమ్మా కొట్టి పార్టీలు, సన్మానాలు చేసుకుంటున్న వెటర్నరీ సిబ్బంది పైన ఇందుకు ప్రధాన కారణం అయిన ఏ.డి. డాక్టర్ దినేష్ కుమార్ పై సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని దాసరి వెంకన్న డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. బుధవారం నెలవారి సబ్ డివిజనల్ సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తామందరూ ఎంతో పని వత్తిడి లో ఉంటున్నామని , బ్లాంకెట్ సర్వే ఏకపాడి పశువు మంజూరు, థైలేరియా వ్యాక్సినేషన్ తదితరు పనులు నిర్వహిస్తూ నెలవారి సమీక్షలు జరుపుకుంటామని అన్నారు. ఆ సమావేశంలో ఇటీవల బదిలీ అయిన కొందరు సిబ్బందికి మధ్యాహ్నం ఒంటిగంట తరువాత ఫేర్వెల్ పార్టీ ఇవ్వడం జరిగిందన్నారు. అంతే తప్ప తమ సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడం అనేది అవాస్తమని ఆయన తెలిపారు.

వైద్యం కోసం వచ్చిన రోగులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తప్పని సరిగా తీసుకురావాలి

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక పి హెచ్ సి వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ ను తప్పనిసరిగా తీసుకురావాలని స్థానిక పి హెచ్ సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పి హెచ్ సి రోజుకు 150 నుండి 200 మంది వరకు పేషెంట్లు ఓపి కి వస్తున్నారని,అయితే వారు ఆధార్ కార్డు,ఆధార్ కార్డు కు లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకురావాలన్నారు. దీనివలన ప్రతి రోగి యొక్క హెల్త్ రికార్డ్ ఆన్ లైన్ లో క్రియేట్ అవుతుందని, ప్రభుత్వం ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ద్వారా ఆన్లైన్లో రోగి యొక్క వాడుతున్న మందులు,రోగి ఏ వ్యాధితో బాధపడుతున్న వివరాలు నమోదవుతాయని తెలిపారు. దీనివలన రోగి ఏ టైం లో ఏ ఆసుపత్రికి వెళ్ళినా, ఆన్లైన్లో చూసి రోగి కి వేగంగా చికిత్స చేయవచ్చునన్నారు. అలాగే హాస్పిటల్లో రోగులకు ఈ హెచ్ఆర్ ఆన్లైన్లో నమోదు చేసిన వివరాలను ఆధారంగా తీసుకొని హాస్పిటల్ కు మందులు, మౌలిక వసతులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరు గమనించి స్థానిక పి హెచ్ సి కి వచ్చిన ప్రతి ఒక్కరు మర్చిపోకుండా ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకురావాలని కోరారు.

జె ఎల్ జి గ్రూపులకు వ్యవసాయ రుణాల పంపిణీ

పిఏసిఎస్ అధ్యక్షుడు గండి దేముడు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక దుర్గాంబ పిఏసిఎస్ లో జె ఎల్ జి గ్రూపు లకు పి ఏ సి ఎస్ అధ్యక్షుడు గండి దేముడు చేతుల మీదుగా ఋణాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ బ్యాంకులో 5గ్రూపులకు 19 లక్షలు రూపాయల రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఒక్కొక్క గ్రూపు లో 5గురు సభ్యులు ఉన్నారని ఈ రుణాల వలన వారికీ వ్యవసాయ కార్యకలాపాలకు, వ్యాపారాలకు ఉపయోగపడుతుందన్నారు. దీని వలన వారి ఆర్థిక స్థితి మెరుగు పరిచడమే తమ సంస్థ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాంబ పిఏసి ఎస్ డైరెక్టర్లు పల్లా తాతారావు, బొబ్బరి కన్నారావు, పిఏసిఎస్ సీఈవో గొంప రమణ, శాప్ డైరెక్టర్ పి. బి. వి. ఎస్. ఎన్.రాజు, గొర్లి అర్జునరావు, రావిపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి దేవికి వికలాంగుల పెన్షన్ కొనసాగించాలి

టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించలపు ప్రదీప్, యాళ్ల వరహాల బాబు

విశాలాంధ్ర-పాయకరావుపేట: గ్రామ సచివాలయం ద్వారా నోటీసు అందుకున్న ఈగల శాంతి దేవికి వికలాంగుల పెన్షన్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు చించలకు ప్రదీప్, యాళ్ల వరహాల బాబు ఎంపీడీవో జయప్రకాశరావుని కోరారు. వికలాంగత్వం 100 శాతం అర్హత ఉండి గ్రామ సచివాలయం నుండి 40 శాతం వికలాంగత్వం ఉన్నట్లుగా నోటీసు రావడంతో ప్రదీప్, వరహాల బాబు, ఎంపీడీవో జయప్రకాశరావుతో కలిసి ఈగల శాంతి దేవి ఇంటికి వెళ్లి ఆమెతో చర్చించారు. శాంతిదేవి వద్ద ఉన్న ధ్రువపత్రాలు ఎంపీడీవో పరిశీలించారు. ఆన్లైన్లో పొరపాటు జరిగి ఉండవచ్చని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని శాంతి దేవికి సూచించారు. ప్రదీప్, వరహాల బాబు మాట్లాడుతూ శాంతిదేవి విషయాన్ని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లి పెన్షన్ కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

మహిళ పరస్పర సహాయ పొదుపు సంఘం నూతన కార్యవర్గం

విశాలంధ్ర-చోడవరం : చోడవరం మహిళ పరస్పర సహాయ పొదుపు సంఘం నాకు బుధవారం ఏర్పాటు చేసిన మహాజనసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం చైర్ పర్సన్ గా లింగం పద్మావతి, బోర్డు డైరెక్టర్లు అధ్యక్షురాలుగా పుల్లేటి వరహాలమ్మ ఉపాధ్యక్షురాలుగా వరుగుబిల్లి హైమావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ మేరకు మహాజనసభలో నూతన కార్యవర్గం ఏర్పాటు ఆమోదాన్ని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. నూతన కార్యవర్గం మాట్లాడుతూ మహిళా సభ్యుల సంక్షేమానికి అభివృద్ధికి సంఘం తరఫున శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ యువజన నాయకుడు పుల్లేటి వెంకటేష్ టౌన్ అధ్యక్షులు ఓరుగంటి నెహ్రూ బాబు తదితరులు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో చిట్టయ్యపాలెం కు చెందిన సేనాపతి కాసులమ్మకు ఇన్సూరెన్స్ సొమ్ము అందజేశారు.

గంజాయి కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర-ఎలమంచిలి : ఎలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాల మేరకు ఎలమంచిలి పోలీస్ స్టేషన్లో 2021 వ సంవత్సరంలో నమోదైన గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న అటువంటి (ఏ 1) ముద్దాయి అయిన (ఏ -1) అన్వరా?న్ తండ్రి పేరు షలీం షా వయసు 30 సంవత్సరములు అని వ్యక్తిని మధ్యప్రదేశ్ లో అదుపులో తీసు కొన్నామని ముద్దాయిను ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ తీసుకు వచ్చామని ఎస్సై ఉపేంద్ర తన సిబ్బందితో కలిసి మధ్యప్రదేశ్ రాష్ట్రం వెళ్లి అరెస్టు చేసి బుధవారం తీసుకొని వచ్చి, విశాఖపట్నం కోర్టులో హాజరు పరచగా కోర్టు వారీ ఉత్తర్వులు ప్రకారం ముద్దాయి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్ కు పంపించారు అని తెలిపారు .

గోడ కూలి ప్రమాదంలో కాలు కోల్పోయిన వ్యక్తికి అక్కరమాని ఔదార్యం

విశాలాంధ్ర-బుచ్చియపేట: మండలంలోని పి పి అగ్రహారం గ్రామానికి చెందిన దాలిబోయిన అప్పారావు నిత్యం అనకాపల్లి పట్టణంలో రోజువారి కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తూ ఉన్న తరుణంలో ఇటీవల అనుకోని ప్రమాదంలో గోడ కూలిపోయి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివరకు కాలు కోల్పోయిన అప్పారావు కుటుంబ పరిస్థితి దీనావస్థను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర యాదవ సంఘం నాయకులు పల్లా నూకరాజు అభ్యర్థన మేరకు విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు అక్కరమాణి విజయ వెంకట్రావు తన ఔదార్యం మరొక్కసారి చాటుకుంటూ కాలు కోల్పోయిన అప్పారావు కు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడికు మేలు జరిగే విధంగా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. ..

ఘనంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మునగపాక: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర జనసేన పార్టీ ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ హాజరయ్యారు.అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశు రామ్,బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు మళ్ల కాశేశ్వరరావు,నాగులాపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జ్ యల్లపు వెంకట భాస్కరరావు,చూచుకొండ పర్సన్ ఇంచార్జ్ పెంటకోట నరసింగరావు,ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్,ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్,జనసేన పార్టీ నాయకులు,గ్రామ ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు,ఏ.వి సత్యనారాయణ,జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు,ఆడారి శ్రీకాంత్,ఎల్లపు సంతోష్ కుమార్,అల్లవరపు రమణబాబు,పల్లి నర్సింగరావు,మారిశెట్టి వెంకటరమణ,ఆళ్ల వెంకటేశ్వరరావు,కారుకొండ కాశీ,వీర మహిళ కుర్రు సరోజినీ,రంగాల సరస్వతి అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

మద్యం షాపులు యజమానులు నిరసన

విశాలాంధ్ర -యన్.రాయవరం: మండలంలోని మద్యం షాపులు నిర్వహిస్తున్న యాజమాన్లు నిరసన తెలియజేశారు .ముఖ్య వ్యాపార కేంద్రమైన అడ్డు రోడ్డులో మద్యం షాప్ వద్ద మండలంలో గల యజమానులు వచ్చి షాపులు మూసివేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఇబ్బందులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పర్మిట్ రూములు పేరుతో సుమారు 7 లక్షల రూపాయలతో పాటు పాత నెలలో సంబంధించి లక్ష రూపాయలు పైగా చెల్లించడంతోపాటు లైసెన్స్ ఫీజును కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు .ఎక్కడో మద్యం సీసా దొరికితే షాపులో పనిచేసే సిబ్బందితోపాటు యజమానులను ఎక్సైజ్ పోలీసులు ఇబ్బందులు పట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వము నిబంధన పాటిస్తున్నప్పటికీ ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం నిర్మించుకోవాలని నిబంధనలను సడలించకపోతే మరింత ఆర్థిక కష్టాలు వస్తాయని ప్రభుత్వము స్పందించాలని కోరారు. ఇదే తరహా సమస్య ఇక్కడే కాకుండా ప్రతి నియోజకవర్గంలోని ఉందని యజమానులు అన్నారు. ఈ కార్యక్రమంలో కమల్ కోయిలాడ, గుర్రం నానాజీ ,పంటగొలుసుల లక్ష్మణరావు షాప్ యజమాలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నీలాకంటరాజుపురం వద్ద జరిగిన రోడ్ ప్రమాదం కేసు ఛేదించిన వల్లంపూడి ఎస్సై.

ప్రశంసించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం గ్రామం కాలువ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం(హిట్ అండ్ రన్) కేసు ను వల్లంపూడి ఎస్సై ఎస్ సుదర్శన్ సిబ్బంది ఆ కేసును త్వరితగతిన చేదించడంతో విజయనగరం జిల్లా ఎస్పి వకల్ జిందాల్ వల్లంపూడి ఎస్సై ఎస్ సుదర్శన్, ఏ.ఎస్.ఐ నాగేశ్వరరావు,కానిస్టేబుల్స్ కనకరాజు సంతోష్ లను అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలు అందించారు.ఈ ప్రమాదంలో మరణించిన వ్యక్తి అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గజపతినగరం గ్రామానికి చెందిన పీలా శివ శంకర్, అయ్యి వున్నాడని సదరు వ్యక్తిని కె.కోటపాడు మండలం వారాడా గ్రామంకు చెందిన బొలెరో వాహనం అతనిని మట్టించుకొని వెళ్ళిపోయింది,పోలీస్ లు చాకచక్యం గా ఈ కేసును చేదించి ముద్దాయిని పట్టుకున్నారు, బొలోరో వెహికల్ డ్రైవర్ పేరు దొగ్గ శివగా గుర్తించి ఈ కేసును చాకచక్యంగా చేదించడంతో వీరికి జిల్లాఎస్పీ ప్రశంస పత్రాలతో పాటు అభినందించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



విశాలాంధ్ర -వి.మాడుగుల : మాడుగుల గ్రామానికి చెందిన కొన్నేటి వెంకటరమణకు అనారోగ్యంతో ఇబ్బందులుపడుతున్నారు. ఈ కారణంగా చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.5లక్షల చెక్కు మంజూరైంది. ఈ మేరకు బుధశారం వెంకటరమణ కుటుంబ సభ్యులకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేరు రిజర్వాయర్ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, టిడిపి మండల కార్యదర్శి పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన

విశాలాంధ్ర -వి.మాడుగుల : అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై మాడుగుల ఫైర్ స్టేషన్ సిబ్బంది, ఫైర్ ఆఫీసర్ వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సాగరం పెట్రోల్ బంకు వద్ద అవగాహన కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. అనంతరం గ్యాస్ సిలిండర్ ఫైర్ అయినప్పుడు ఎలక్ట్రికల్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది అర్జున్, పిఎస్ఎస్.వర్మ, పివిఆర్.మూర్తి, జె.ప్రకాష్ పాల్గొన్నారు.

వికలాంగులతో కూటమి ప్రభుత్వం చెలగాటం

- పాయకరావుపేట మండలంలో 42 మంది వికలాంగ పెన్షన్ దారులకు నోటీసులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: వికలాంగులతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల ఎరివేతలో భాగంగా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకుంటున్న వికలాంగుల పెన్షన్లు తగ్గించేందుకు, బోగస్ పెన్షన్ల ఏరివేత పేరుతో వికలాంగుల పెన్షన్లు తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్న వికలాంగులు అందరికీ ఇటీవల సదరం క్యాంప్ నిర్వహించారు. ఇందులో పెన్షన్ తీసుకుంటున్న వారి వద్ద ఉన్న సర్టిఫికెట్లు, ఫిజికల్ గా వారిని పరిశీలించి వికలాంగత్వాన్ని ధ్రువీకరించే పని చేపట్టారు. పాయకరావుపేట మండలంలో 1338 వికలాంగుల పెన్షన్ పొందుతుండగా అందులో 42 మందికి నోటీసులు జారీ అయ్యాయి. ఆ నోటీసుల్లో వారికి గతంలో ఉన్న వికలాంగత్వం కంటే తక్కువ వికలాంగత్వం ఉన్నట్లు గ్రామ సచివాలయాల ద్వారా వికలాంగులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాక 16 మంది వికలాంగుల పెన్షన్ తీసుకుంటుండగా వారిని వృద్ధాప్య పింఛను జాబితాలో చేర్చినట్టు తెలిసింది. దీంతో నోటీసులు అందుకున్న వికలాంగులంతా తమ పింఛన్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పాయకరావుపేటలో జాతీయ రహదారికి సమీపంలో ఉంటున్న పుట్టుకతో కళ్ళు కోల్పోయి గత 10 ఏళు గా వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్న ఈగల శాంతి దేవికి గ్రామ సచివాలయం నుండి నోటీసు జారీ అయింది. గతంలో వికలాంగత్వం 100 శాతం ఉండగా, తాజాగా నిర్వహించిన సదరం క్యాంపులో 40 శాతం మాత్రమే ఉన్నట్లు ధ్రువీకరిస్తూ నోటీసులో పేర్కొన్నారు. దీంతో తనకు వచ్చే నెల నుంచి పెన్షన్ నిలిచిపోతుందని శాంతి దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఉండడానికి ఇల్లు కూడా లేకుండా, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న తనకు పెన్షన్ కూడా రద్దు చేస్తే జీవనం గడవటం కష్టంగా మారుతుందని శాంతి దేవి ఆవేదన వ్యక్తం చేసింది. హెూం మంత్రి వంగలపూడి అనిత, అధికారులు చర్యలు తీసుకొని తన వికలాంగత్వాన్ని పునః పరిశీలించి పెన్షన్ కొనసాగించాలని కోరుతుంది. రెండు కళ్ళు లేకుండా పోయి జీవితం అంధకారమైతే, దీనికి సంబంధించిన ధ్రువపత్రం ఉంటే, ఎంత శాతం వికలాంగత్వం ఇవ్వాలో అంచనా వేయలేని కళ్ళుండి కబోదిల్ల అధికారుల వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వైసిపి కి బొలిశెట్టి వర్గం ఎంపిటిసిలు , సర్పంచ్ లు రాజీనామా

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండలంలోని ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు వర్గానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీకి రాజీనామా చేశారు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారద కుమారి మాట్లాడుతూ ...మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న తమకు అన్యాయం జరుగుతున్న పట్టించుకోలేదని విమర్శించారు. తన భర్త పార్టీకి రాజీనామా చేసినప్పటికీ మేము పార్టీలో ఉన్నామని అయితే ఇటీవల ఎంపీపీ ఎన్నిక సమయంలో తమకు తెలియకుండానే పార్టీ నుంచి మరో వ్యక్తిని పోటీలోని నిలపడము ఎంతవరకు సమంజసమని అన్నారు. ఎంత జరుగుతున్న అధిష్టానం ఎందుకు పట్టించుకోలేదు అర్థం కావడం లేదని అధికారంలో ఉన్న సమయంలో కూడా ఇటువంటి ఇబ్బందులు పడ్డామని అన్నారు. దానికి నిరసనగా తమకు మద్దతు పలికిన ఎంపిటిసి లతోపాటు పలువురు సర్పంచులు రాజీనామా చేసినట్లు వెల్లడించారు .జడ్పిటిసి కాకర దేవి మాట్లాడుతూ ...పార్టీలోనే ఏ మీటింగ్ కి తనను పిలవడం లేదని నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చిన బొలిశెట్టి గోవిందరావుకు మద్దతుగానే ఉంటానని అయితే ప్రస్తుతానికి నేను పార్టీకి ఎటువంటి రాజీనామా చేయలేదని అవసరమైన సందర్భంలో నా నిర్ణయాన్ని వెల్లడిస్తానన్నారు. వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ ..తను ఓడించడానికి వైసిపి పెద్దలు ప్రయత్నం చేశారని ఆయనప్పటికీ ఎంపీపీ ఎన్నికల్లో తన వర్గం వ్యక్తిని ఎంపీపీగా చేసుకోవడం జరిగిందన్నారు. దీనికి సహకరించిన హెూం శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ సమావేశంలో ఎంపీపీ వెంకటలక్ష్మి వైసిపి సీనియర్ నాయకులు కొణతాల శ్రీనివాసరావు ,ఎంపీటీసీలు బైపా శ్రీను ,బాలం సూరిబాబు , సర్పంచ్ భూపతి అప్పారావు ,దూళి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛను ఇచ్చేంతవరకు సొంతనిధులతో పింఛన్లు అందజేస్తా

తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు రాజబాబు

విశాలాంధ్ర-పాయకరావుపేట : ప్రభుత్వం పింఛన్ తిరిగి ఇచ్చేంతవరకు తన సొంత నిధులు పింఛనుగా అందజేస్తానని తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు, సిడిసి మాజీ చైర్మన్ గొర్రెల రాజబాబు తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారి వై జంక్షన్ సమీపంలో నివాసం ఉంటున్న ఈగల శాంతి దేవి కి గ్రామ సచివాలయం ద్వారా నోటీసు రావడంతో సమాచారం తెలుసుకున్న రాజబాబు ఆమె ఇంటికి వెళ్లి విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఈగల శాంతిదేవి చిన్నతనం నుంచి తనకు తెలుసునని, రెండు కళ్ళు లేకుండా జీవనం కొనసాగిస్తుందని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో శాంతి దేవికి వికలాంగుల పింఛన్ మంజూరై అప్పట్నుంచి పదేళ్లుగా పింఛన్ తీసుకుంటుందని తెలిపారు. అయితే అధికారులు ఇటీవల నిర్వహించిన సదరం క్యాంపులో శాంతి దేవికి 40 శాతం మాత్రమే అంగవైకల్యం ఉన్నట్లు గ్రామ సచివాలయం నుండి నోటీసు జారీ అయినట్లు తెలిపారు. శాంతి దేవికి నోటీసు వచ్చిన విషయాన్ని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లి పింఛను ఇప్పిచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అప్పటివరకు తన సొంత నిధులు పింఛనుగా అందజేస్తానని రూ. 6 వేలు శాంతి దేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తలారి రాజా, జగతా శ్రీను, భజంత్రీల శివ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు ఎం.వి.ఆర్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-అనకాపల్లి: కృష్ణాష్టమి వేడుకలలో అన్నసమారాధన అంటే కృష్ణుడి భక్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అందరూ కలిసి భోజనం చేయడం అని ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరావు తనయుడు ముత్యాల రాజేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక నరసింగరావుపేటలోని వారి కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఆ ప్రాంతానికి చెందిన,దుర్గా లాడ్జి వీధి చివర గల శ్రీ కృష్ణకమిటీ సభ్యులకు ఈ ఆదివారం నిర్వహించ బోయే అన్న సమారాధన కార్యక్రమానికి తన వంతు సహాయంగా 50 వేల రూపాయలను ధన సహాయంగా అందించారు.ఈ సందర్భంగా ముత్యాల రాజేష్ మాట్లాడుతూ.హిందూ పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది శ్రావణమాసంలో కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి నాడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు.ఈ పవిత్రమైన రోజున ప్రపంచంలో నలుమూలల కృష్ణ భగవాను యొక్క వేడుకలు ఘనంగా, ఉత్సాహం గా నిర్వహిస్తుంటా మన్నారు. ఆ వేణు మాధవుడు లోకానికి గురువు అని, గీతను బోధించి లోకంలో ఉండే ప్రతి ఒక్కరికీ దారి చూపాడన్నారు. చిన్నతనంలో కన్నయ్యను అందరూ అల్లరి పిల్లాడుగా చూసేవారని ... తన చిలిపి చేష్టలతో జీవిత ప ం వ ా ం ్ా న ి ్ల వివరించారన్నారు . వెన్న దొంగగా మారి గోపికలతో పాటు అందరి మనసులను దోచుకున్న మానసా చోరుడు అని ముత్యాల రాజేష్ అన్నారు.అంతేకాదు గోప బాలకుడిగా, సోదరునిగా, అసురసంహారిగా, ధర్మ సంరక్షకుడిగా ఎన్నో పాత్రలు పోషించాడని, కన్నయ్య ఎన్ని పాత్రలు పోషించినా అంతా లోక కళ్యాణం కోసమే నని రాజేష్ పేర్కొన్నారు. అందుకే, ప్రతీ సంవత్సరం భక్తి శ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించి, నిష్ఠగా స్వామివారిని పూజిస్తారన్నారు.దీనిలో భాగంగా, స్థానిక నరసింగరావు పేట ప్రాంతానికి చెందిన కృష్ణ భక్తలకు ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అన్నసమారాధన కు ధన సహాయం చేసామన్నారు. ఈ మేరకు ముత్యాల రాజేష్ కుటుంబానికి... కృష్ణ భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఆధ్వర్యంలో టీకా కార్యక్రమంలో మహారాజా ఫార్మసీ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గ్రామ వార్డు సచివాలయం, పూల్ బాగ్, ఆధ్వర్యంలో నిర్వహించిన రోగనిరోధక టీకాల కార్యక్రమంలో మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా విద్యా సంస్థల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు, ప్రజల్లో ఆరోగ్య అవగాహనను పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు , స్థానిక సచివాలయ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇలాంటి సమాజోన్నతి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం ద్వారా వైద్య, ఆరోగ్య రంగంపై అవగాహన పెంపొందించు కోవడమే కాకుండా, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

మాజీమంత్రి ఆర్ కె రోజా ని మర్యాదపూర్వకంగా కలిసిన గండి రవికుమార్

విశాలాంధ్ర-సబ్బవరం: అనకాపల్లి జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,చోడవరం నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తో కలిపి విశాఖపట్నం విచ్చేసిన మాజీమంత్రివర్యులు ఆర్ కె రోజా ని బుధవారం పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.వీరితో వైస్సార్సీపీ నాయకులు యడ్ల నాయుడు , సిరపరపు వాసు ఉన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవం

విశాలాంధ్ర-అచ్యుతాపురం : దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి డి రవిబాబు అన్నారు . బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డి రవిబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమ వలన మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త 1897 ఆగస్టు 20న కనుకున్నారని , దానికి గుర్తుగా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు . వైద్యాధికారిని షకీన మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా , డెంగ్యూ , చికెన్ గునియా , ఫైలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయని చుట్టుపక్కల నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని . ప్రతి వారం డ్రైడే పాటించాలన్నారు . టైర్లు , కొబ్బరిబొండాలు , రుబ్బురోలు లాంటివి పరిశీలించి , ఎప్పటికప్పుడు శుభ్రపరచాలనే అవగాహన ప్రజల్లో విస్తృతంగా కల్పించాలన్నారు . ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ శ్రీనివాస్ , ఆరోగ్య బోధకులు రామలక్ష్మి , ఆరోగ్య పర్యవేక్షకులు సునీత , ఉమా మహేష్ , వైద్య సిబ్బంది గణేష్ , లక్ష్మీ , ఇందిరా , ఏఎన్ఎం , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .